సాక్షి నంద్యాల

శనివారం : 6 : మే : 2023



భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీ భ్రమరాంబాదేవికి ఊయల, పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సహస్ర నామ పూజలు చేశారు.



నేడు గుడేకల్ ఉరుసు

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ గ్రామంలో శనివారం జరిగే సద్గురు అల్లీపీరాస్వాముల ఉరుసుకు భక్తులు తరలివస్తున్నారు. దర్గా ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.



కుండపోత వర్షం

ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతుండగా.. భూగర్భ జలాల గణనీయంగా పెరిగాయి.

IIలో▶

సూక్ష్మ సేద్యానికి దన్ను

- రైతులకు రాయితీలపై డ్రిప్, స్ప్రింక్లర్లు
- 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం సబ్సిడీతో పరికరాలు
- గత ఏడాది 4,435 హెక్టార్లకు పంపిణీ
- ఈ ఏడాది లక్ష్యం 5 వేల హెక్టార్లు
- పరికరాలకు ఆర్బీకేల్లో మొదలైన రిజిస్ట్రేషన్లు

వ్యవసాయరంగం బలోపేతానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అన్నదాతలకు అండగా నిలుస్తూ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. రైతుభరోసా, సున్నావడ్డీకి రుణాలు, పంటల బీమా తదితర పథకాల అమలుతో పాటు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు రాయితీపై అందజేస్తోంది. తాజాగా తక్కువ ఖర్చుతో అధిక పంట దిగుబడుల సాధనకు సూక్ష్మసేద్యాన్ని మరింత విస్తృతం చేస్తోంది.





డ్రిప్ పరికరాలతో అరటి పంటను సాగు చేస్తున్న దృశ్యం

నంద్యాల: ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేలా ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇందు కోసం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందజేస్తుంది. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులకు 5 ఎకరాల్లోపు ఉంటే 90 శాతం రాయితీ, 5 నుంచి 10 ఎకరాలు ఉంటే 70శాతం రాయితీ ఇస్తున్నారు. స్ప్రింక్లర్లు కావాల్సిన 5 ఎకరాల్లోపు రైతులకు 50 శాతం సబ్సిడీ, 5 నుంచి 12.5 హెక్టార్లు ఉన్న రైతులకు 45 శాతం రాయితీ అందజేస్తున్నారు.

ఈ ఏడాది లక్ష్యం 5వేల హెక్టార్లు

2023–24 సంవత్సరంలో సూక్ష్మ సేద్యానికి జిల్లాలో 5వేల హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వ్యవసాయాధికారులకు లక్ష్యం నిర్దేశించింది. గత ఏడాది జిల్లాలో సూక్ష్మ సేద్యానికి 4వేల హెక్టార్లు లక్ష్యం కాగా 4,435 హెక్టార్లలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేశారు. ఈ ఏడాది అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంత భూమి ఉంది, బోరు సదుపాయం ఉందా? ఉంటే అందులో ఎంత నీరు వస్తుంది. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి?, పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుంది, ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను ఆర్బీకేల ఉద్యాన, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, కంపెనీ ప్రతినిధులు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. తర్వాత డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేస్తారు.

13 కంపెనీల్లో ఏదైనా ఎంచుకోవచ్చు...

రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు రిజిస్ట్రేషన్లు చేసుకునే సమయంలోనే వారికి కంపెనీని ఎంచుకునే అవకాశం ఇస్తున్నారు. జెయిన్, సిగ్నేట్, ఫినోలెక్స్, కాప్టెయిన్, కొథారి, మహేంద్ర, రివులైస్, మెగా అగ్రిటెక్, సుధాకర్ ఇరిగేషన్, ప్రీమియర్, సిఫ్లోన్, శ్రీఅంజని, నింబస్ కంపెనీల్లో రైతులకు ఇష్టమొచ్చిన కంపెనీ ఎంచుకోవచ్చు.

గత ఏడాది రాయితీ రూ.14కోట్లు..

బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు భూమి విస్తీర్ణం మేరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. గత ఏడాది 4,435 హెక్టార్లలో బిందు సేద్యం పరికరాలు తీసుకున్న రైతులకు రూ.14 కోట్లు ప్రభుత్వం రాయితీ అందజేసింది.

90శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు



ఈ ఏడాది నేను అరటి పంట సాగు చేశాను. పంట సాగుకు ముందే మైక్రో ఇరిగేషన్ అధికారులను కలిసి డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు నాలుగు ఎకరాల్లోపు పొలం ఉండటంతో 90 శాతం సబ్సిడీతో పరికరాలు అధికారులు అందజేశారు. అరటి పంట ప్రస్తుతం చాలా బాగుంది.

–నారాయణ, గాజులపల్లె, మహానంది

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే అరటి సాగు



ప్రభుత్వం సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తుందని తెలుసుకుని ఈ ఏడాది అరటి సాగు చేయాలని నిర్ణయం తీసుకున్నాను. రెండు ఎకరాల పొలంలో పంట వేసి మూడు నెలలు అవుతుంది. ఈతాకులతో మొక్కలకు నీడను కల్పించాను. డ్రిప్ పరికరాలతో నీరు అందిస్తున్నాను.

–వెంకటప్రతాపరెడ్డి, చింతలాయపల్లె, కొలిమిగుండ్ల

అర్హులందరికీ పరికరాలు



డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి లక్ష్యానికి మించి అదనంగా యూనిట్లు అందించడానికి కృషి చేస్తున్నాం. రైతులు తమ పరిధిలోని ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. తర్వాత అర్హత ఉన్న ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేస్తాం. ఉద్యాన, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ల ద్వారా పరికరాలను అందజేస్తాం. ఆర్బీకే ద్వారా రైతులు తమకు ఏ కంపెనీ డ్రిప్ పరికరాలు కావాలో ఎంచుకోవచ్చు.

– సత్యనారాయణ, మైక్రో ఇరిగేషన్ అధికారి, నంద్యాల

పోలీసులు వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలి

- ఎస్పీ రఘువీర్ రెడ్డి



ప్రత్యేక వాహనం నుంచి కవాతును పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసులు నిత్య విద్యార్థులుగా ఉంటూ ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అన్నారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీస్ మొబిలైజేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఆర్(ఆర్మ్‌డ్ రిజర్వ్) పోలీసులు మైదానంలో కవాతు చేశారు. ప్రత్యేక వాహనం నుంచి కవాతును ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో కొత్తగా తలెత్తే సమస్యలపై పోలీసులకు అవగాహన ఉండాలన్నారు. నంద్యాల నూతన జిల్లాగా ఏర్పాటైన తర్వాత మొదటి సారిగా మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించి ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోస్తుపై శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, మారుతీరావు, రంగముని తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సిటీ): జిల్లాలోని 20 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 9 నుంచి 25వరకు www.cse.ap.gov.in/apms.ap. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 11వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవోపేతం.. నారసింహుని జయంతోత్సవం




గరుడ వాహనంపై విహరిస్తున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ: అహోబిలంలో నారసింహ జయంతి మహోత్సవం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని శుక్రవారం దిగువ అహోబిలంలో మూలమూర్తి శ్రీప్రహ్లాద వరద స్వామి, అమృతవల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు తిరుమంజనం జరిపారు. స్వాతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. ఎగువ అహోబిలంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత నరసింహ స్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

నేడు 'పది' ఫలితాలు

నంద్యాల(సిటీ): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు నేడు(శనివారం) ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ విడుదల చేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియ జేశారు. విద్యార్థులు www.results.bse.ap.gov.in అనే వెబ్‌సైట్‌ను సంప్రదించి ఫలితాలు తెలుసుకోవచ్చని సూచించారు.

నిరంతరాయంగా మహానందీశ్వరుడి దర్శనం



మహానంది ఆలయం

మహానంది: వేసవి సెలవులు, భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల చివరి వరకు మహానందీశ్వర స్వామి దర్శనం నిరంతరాయంగా కల్పిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మాపాల మహేశ్వర రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా శని, ఆది, సోమవారాలు మినహా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి దర్శనం ఉంటుందన్నారు. అయితే రద్దీ నేపథ్యంలో నెలరోజుల పాటు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయ దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

రేపు ఏడు కేంద్రాల్లో 'నీట్'

కర్నూలు(సిటీ): వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే నీట్(నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) రేపు (ఆదివారం) నిర్వహించనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో పరీక్ష నిర్వహించేవారు. ఈ ఏడాది కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేర్వేరుగా జరుపుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎ.క్యాంప్ మాంటిస్సోరి హైస్కూల్, మాంటి (ఇండస్) ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజ్, శ్రీలక్ష్మీ హైస్కూల్, కేవీఆర్ డిగ్రీ కాలేజ్, మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సుమారుగా పది వేల మంది విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో పరీక్ష రాయనున్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి నగరంలోని ఓ కాలేజీలో పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

సిల్వర్‌సెట్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(సిటీ): సిల్వర్‌జూబ్లీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న సిల్వర్‌సెట్‌కు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు పెంచారు. ఈ మేరకు సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరికొంతమందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గడువు పెంచినట్లు ఆయన తెలిపారు.

టీబీ ప్రొఫెసర్ వెంకటరావు బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని టీబీసీడీ ప్రొఫెసర్, హెచ్‌వోడి డాక్టర్ ఎం.వెంకటరావు బదిలీ అయ్యారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్‌లో భాగంగా ఆయనను విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీకి.. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఎ.ఎస్.శ్రీకాంత్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం టీబీసీడీ/పల్మనరీ మెడిసిన్ విభాగం హెచ్‌వోడిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. వేణుగోపాల్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

షాదీతోఫాతో ముస్లిం కుటుంబాల్లో సంతోషం

- జిల్లాలో 419 మందికి రూ.3.21 కోట్ల లబ్ధి
- మెగా చెక్కును లబ్ధిదారులకు అందించిన కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే ఆర్థర్



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తదితరులు

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణమస్తు, షాదీతోఫా పథకంతో ముస్లిం మైనార్టీ వర్గాల్లో, పేదల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ అన్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నిధులు జమ చేశారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డీడీ చింతామణి, లబ్ధిదారులు కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ.. జిల్లాలో జనవరి నుంచి మార్చి నెల వరకు 419 మంది లబ్ధిదారులకు రూ.3,21,85,000 ఆర్థిక సాయం జమ అయ్యిందన్నారు. ఆళ్లగడ్డ 51, బనగానపల్లె 57, నందికొట్కూర్ 85, డోన్ 87, నంద్యాల 53 , పాణ్యం 25, శ్రీశైలం నియోజక వర్గంలో 61 మంది చొప్పున మొత్తం 419 మంది లబ్ధిదారులకు రూ. 3,21,85,000 నగదును పెళ్లి కుమార్తెల తల్లుల ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వం జమ చేసిందన్నారు.

గత ప్రభుత్వం కంటే రెట్టింపుగా..

ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరగకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించేందుకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాన్ని తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం ఎస్సీలకు రూ.40వేలు, ఎస్టీలకు రూ.50వేలు మాత్రమే ఇచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష ఇవ్వడమే కాకుండా మిగిలిన కులాలకు సైతం గత ప్రభుత్వం కంటే రెట్టింపు నగదును వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫాల కింద అందజేస్తోందన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యం..

ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు హబీబుల్లా మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నివారించి పిల్లల చదువులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు విభిన్న ప్రతిభావంతులు, ఇతర భవన నిర్మాణ కార్మికులకు ఈ పథకం కింద ఆర్థిక సాయం అందుతోందన్నారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి ఆదరాభిమానాలు చూరగొంటున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా మెగా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అందజేశారు.

10 నుంచి రాహుకేతు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రాహుకేతు రాతి విగ్రహ ప్రతిమల ప్రతిష్ఠ, కాలసర్ప యంత్ర ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారన్నారు. త్రయాహ్నిక దీక్షతో పూజలు ఉంటాయని చెప్పారు. 13 నుంచి రాహుకేతు, కాలసర్పదోష, అంగారక పూజలు ప్రారంభిస్తారన్నారు. సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.



అర్చకులతో మాట్లాడుతున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మద్దిలేటి స్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల:మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని స్వాతి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కల్యాణ చక్రవర్తి ఉభయ దేవేరుల సమేతుడైన నరసింహస్వామికి సుప్రభాత సేవలు, ప్రత్యేక పూజలు, విశ్వక్సేనారాధన,వాసుదేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహ హోమం పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం అలంకార ప్రియుడైన స్వామి వారిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచారు.



పుష్పాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి

స్తంభించిన రాకపోకలు

- 4 గంటల పాటు ఇబ్బందులు

కొలిమిగుండ్ల: బనగానపల్లె–తాడిపత్రి ప్రధాన రహదారిపై కొలిమిగుండ్ల– బెలుం మధ్య గ్యాస్ గోడౌన్ సమీపంలో శుక్రవారం రాకపోకలు స్తంభించిపోయాయి. ఉదయం ఆరు గంటల సమయంలో తాడిపత్రి నుంచి వెళుతున్న లారీ రోడ్డు పక్కన ఇరుక్కుపోవడం, అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరొక లారీ సమీపంలోనే ఇరుక్కుపోవడంతో సమస్య వచ్చింది. దీంతో నాలుగు గంటల పాటు పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. బనగానపల్లె, నంద్యాల, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు సమస్యను పరిష్కరించారు.



వైద్యం వికటించి వ్యక్తి మృతి!

డోన్: ప్యాపిలి పట్టణంలో ఓ ఆర్‌ఎంపీ నిర్వాకం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. పట్టణానికి చెందిన చంద్రశేఖర్ (40) మూడు రోజుల క్రితం తీవ్రమైన జ్వరంతో సినిమా థియేటర్ వీధిలో ఉంటున్న ఆర్‌ఎంపీని సంప్రదించాడు. అతనికి ఆర్‌ఎంపీ చికిత్స అందించాడు. అయితే రోగి పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలిస్తుండగా చంద్రశేఖర్ మృతి చెందాడు. వైద్యం వికటించి మృతి చెందడంతో ఆర్‌ఎంపీ.. బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌ఎంపీని వివరణ కోరగా తన వద్దకు వచ్చిన చంద్రశేఖర్‌కు రక్తకణాలు తక్కువగా ఉన్నాయని, వెంటనే కర్నూలుకు తీసుకెళ్లాల్సిందిగా చెప్పానని తెలిపాడు. అయితే ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

మోటారు మరమ్మతులపై ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రిక్ మోటారు రీవైండింగ్, రిపేర్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు వారు అరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన మూడో అంతస్తులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అందచేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000710508 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

అరుణాచలానికి ఇంద్ర ఏసీ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం ఈ నెల 13వ తేదీన ఇంద్ర ఏసీ ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్-93998)ను నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు శనివారం ఉదయం 7గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి కాణిపాక దర్శనం అనంతరం రాత్రి 8 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బయలుదేరి, దారిలో వేలూరు స్వర్ణ దేవాలయ అమ్మవారి దర్శనం అనంతరం సోమవారం ఉదయం 6గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం ప్రత్యేక బస్సు చార్జీ రూ.2,500 ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు 9959225794, 7382871131 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వెదురు బొంగుల వేలం

రుద్రవరం: స్థానిక కలప డిపోలో శుక్రవారం డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ వెదురు బొంగులకు వేలం నిర్వహించారు. ఏటా అక్టోబర్ నుంచి జూన్ మాసం వరకు రుద్రవరం రేంజిలో వెదురు సేకరణ, వేలం పాటలు సాగేవి. ఈ ఏడాది మేలో వెదరు సేకరణ ప్రానరంభం కావడంతో శుక్రవారం మొదటి వేలం పాటలు నిర్వహించారు. రెండో తరగతికి చెందిన 13,500 వెదుర్లకు వేలం నిర్వహించగా రూ.4,80,900 ఆదాయం వచ్చినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. వేలం పాటల్లో రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజావలి, ఫారెస్టర్లు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

హాలహర్విలో 10.3 సెం.మీ వర్షపాతం
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- రానున్న నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం



మద్దికెరలో ఓ పొలం గట్టు నుంచి పారుతున్న వర్షం నీరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. గత పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కురుస్తున్న వర్షాలతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. సాధారణంగా వేసవిలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సారి భారీ నుంచి కుండపోత వర్షాల కారణంగా దాదాపు ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించకపోవడం విశేషం. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతుండగా.. భూగర్భ జలాల గణనీయంగా పెరిగాయి. ఫలితంగా బావులు, బోర్ల కింద కూరగాయలు, ఇతర పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వైశాఖ మాసంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. అయితే వర్షాలు పడటం వల్ల వేసవి చల్లారినట్లయింది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని 20 మండలాల్లో వర్షాలు కురిశాయి. ఒకటి, రెండు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. హాలహర్విలో అత్యధికంగా 103.4 మి.మీ., (10.3 సెం.మీ) వర్షపాతం నమోదైంది. మద్దికెరలో 96.2, ఆలూరు 50.4, ఎమ్మిగనూరు 33.6, ఆస్పరి 21.4, పత్తికొండ 18.2, తుగ్గలిలో 18.2 మి.మీ., వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 15.5 మిమీ వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మిమీ ఉండగా.. మొదటి వారంలోపే 53.9 మి.మీ., వర్షపాతం నమోదు కావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రానున్న రోజుల్లో భారీ వర్షాలు

రానున్న నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆగ్నేయ బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావం వల్ల రాయలసీమ జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. తుపాను ప్రభావం శనివారం నుంచి ఉండే అవకాశం ఉందని, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

పల్లెల్లో అభివృద్ధి పనులకు నిధులు

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రాధాన్యత భవన(ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ కేంద్రాలు) నిర్మాణాలు, సీసీ రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం పీఆర్ ఎస్‌ఈ కె.సుబ్రమణ్యం విలేకరులతో మాట్లాడుతూ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి రూ.26.10 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయగా, రూ.16.96 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అలాగే సీసీ రోడ్లకు రూ.6.78 కోట్ల బిల్లులకు గాను రూ.2.37 కోట్లు విడుదలయ్యాయన్నారు. జిల్లాలోని రూఫ్ లెవెల్, పూర్తి కావచ్చిన భవన నిర్మాణాలకు ఆయా దశల ఆధారంగా నెలవారీ బిల్లులు చెల్లించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారన్నారు.



తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో పూర్తి కావచ్చిన ఆర్‌బీకే భవనం

వ్యక్తి ఆత్మహత్య?

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన బరగొడ్ల మద్దిలేటి(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిలేటి మందులు వాడుతున్నాడు. ఈనెల 3న మందులు తెచ్చుకునేందుకని బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా ఆరా తీస్తుండగా శుక్రవారం ఉదయం చెట్టుకు విగతజీవిగా వేళాడుతూ ఉన్నాడని సమాచారం అందడంతో భార్య సువర్ణమ్మ అక్కడికి చేరుకుని విలపించింది.



మద్దిలేటి (ఫైల్)

బతుకుదెరువు కోసం వచ్చి..

అవుకు మండలం మంగంపేట గ్రామానికి చెందిన మద్దిలేటి, సువర్ణమ్మ దంపతులు బతుకు దెరువు కోసం 20 ఏళ్ల క్రితం నందవరం గ్రామానికి వచ్చారు. మద్దిలేటి డోజర్ డ్రైవర్‌గా, సువర్ణమ్మ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇటీవల పాదువు లక్ష్మి డబ్బుల విషయంలో కొందరితో గొడవ పడటం తప్ప ఎలాంటి వివాదాలకు పోయే వ్యక్తి కాదని పలువురు పేర్కొంటున్నారు.

ఉరి తీరు అనుమానాస్పదం..

అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాళ్లు, చేతులు కట్టేసి ఉన్న తీరును చూసి ఎవరైనా ఉరి వేసి చంపారా అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేశారు. కాగా భార్య సువర్ణమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఆత్మహత్యా, హత్యా అనేది దర్యాప్తులో తెలుస్తుందని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.



టీడీపీ హయాం: విత్తనాల కోసం చుట్టుపక్క గ్రామాల రైతులు హొళగుందకు వచ్చి రోడ్డుపై ముళ్లకంచె వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: చిన్నహ్యాట గ్రామంలోనే రైతులకు ఎరువుల పంపిణీ దృశ్యం

పాలన చేరువై.. ప్రజల గుండెల్లో కొలువై!



టీడీపీ హయాం: హొళగుందలో పింఛన్‌ల కోసం నిరీక్షణ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: పెద్దగోనెహాళ్‌లో పొలం వద్దకే వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎలాంటి ఇక్కట్లు ఎదుర్కొన్నారో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో కళ్ల ముందు కనిపిస్తోంది. ఒకప్పుడు విత్తనాలు కావాలంటే చాతాండు క్యూలు, ఊళ్లలో పనులు వదులుకొని మండల కేంద్రాల్లో పాసు పుస్తకాలను క్యూలో పెట్టి నీడపాటున నిరీక్షిస్తున్న దృశ్యాలు తలుచుకుంటేనే చెమటలు పడతాయి. ఇక పింఛన్ల విషయానికొస్తే పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో పాటు ఆ ప్రాంతం జాతరను తలపించేది. ఇదే సమయంలో ట్యాబ్‌లు పనిచేయక, నెట్‌వర్క్ సమస్యతో ఆ రోజు పింఛను ఇస్తారో లేదో తెలియక వృద్ధులు, వికలాంగులు నిట్టూరుస్తూ ఇళ్లకు చేరుకోవడం చూశాం. ఇప్పుడు ఏ పథకమైనా ఇంటి తలుపు తడుతోంది. వలంటీర్లు ఒకటో తేదీన ఠంచనుగా ఉదయాన్నే తలుపుతట్టి మరీ పింఛను చేతికందిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు కోసం ఎక్కడెక్కడో తిరిగే పనిలేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రం రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. ఇంతేకాదు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరు ఒకరు చెప్పడం కాదు, ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపిస్తుండటంతో ప్రతిపక్షాల నోళ్లు మూతపడుతున్నాయి. – హొళగుంద



టీడీపీ హయాం: అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి(ఫైల్)



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: నేడు అన్ని వసతులతో రూపుదిద్దుకుంటున్న సీసీ రోడ్డు

అంతర్గత రోడ్లకు వీడిన గ్రహణం

కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలో సుమారు 50 ఏళ్లుగా పెండింగ్‌లోని అంతర్గత రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రహణం వీడింది. గ్రామంలోని పలు కాలనీల్లో ఏళ్ల తరబడి రోడ్లు సరిగా లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజలకు మంచి రోజులు వచ్చాయి. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో కోటి రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – కోవెలకుంట్ల

బాలాజీ నగర్‌లో భారీ చోరీ

కర్నూలు: స్థానిక బాలాజీ నగర్‌లో భారీ చోరీ జరిగింది. కేశవ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 402లో భూపాల్‌రెడ్డి, సుకన్య దంపతులు నివాసముంటున్నారు. సుకన్య నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో 8 నెలలుగా అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి విధుల నిమిత్తం నంద్యాలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దోచుకుని పరారయ్యారు. ప్రధాన వాకిలికి వేసిన తాళాలు పగులగొట్టి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుగొట్టి అందులో ఉన్న 42 తులాల బంగారు నగలను మూటగట్టుకుని ఉడాయించారు. సుకన్య సాయంత్రం తిరిగి వచ్చే సరికి తలుపులు తెరిచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామగ్రి చిందరవందరగా పడివున్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని శుక్రవారం ఉదయం కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలనరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. నేరం జరిగిన తీరును పరిశీలించి ఇరుగుపొరుగు వారితో చోరీ విషయంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

- వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

కర్నూలు(హాస్పిటల్): వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ యాప్ ద్వారా హాజరు వేసి సమయపాలన పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్, ఎల్‌ఎంహెచ్‌పీ, ఏఎన్‌ఎం యాప్‌లలో వారికి పొందుపరిచిన ఆరోగ్యసేవల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రోగ్రామ్ అధికారులు వారి పరిధిలోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరువేసేలా చూడాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్‌మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్సలు అందించి వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్, సిమ్‌కార్డులను విధిగా వాడేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌లను ప్రోగ్రామ్ అధికారులు సందర్శించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి తగిన నివేదికలను ప్రతి శనివారం సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీటీసీఓ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, ఫ్యామిలి ఫిజిషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, కంటివెలుగు కో ఆర్డినేటర్ డాక్టర్ జి.భరత్, మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దేవసాగర్

తేరు.. భక్తజన హోరు



భక్తజన సందోహం మధ్య కోసిగయ్య రథోత్సవం

కోసిగి(మంత్రాలయం): శ్రీ ఆంజనేయ స్వామి (కోసిగయ్య) మహా రథోత్సవం శుక్రవారం సాయంత్రంలో కోసిగిలో వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. సంప్రదాయం ప్రకారం సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన కుమారులు శ్రీనివాస రాజు దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఊరేగింపుగా రథం వద్దకు వచ్చారు. ఉత్సవమూర్తులకు పూజలు చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని లాగుతూ.. రథంపైకి అరటి, మామిడి పళ్లు విసిరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు వేకువజాము నుంచి ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు శ్రీరాములు ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండికవచ అలంకరణలు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్‌ల సారథ్యంలో స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి మేళతాళాలు, కలశాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తేరుబజారు మైదానం వరకు వచ్చారు. అక్కడ సీతమ్మ కట్టపై కొలువుంచి వేదపండితులు సీతరాముల స్వామి వారి నిశ్చయ తాంబూలం అందజేసి నారికేళాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, ఆలయ ఈఓ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.